# వామనుడు

ఇంజనీర్‌గారి ఇంటి దగ్గర అగాడు అప్పల కొండ. అటూఇటూ చూశాడు. లక్ష్మి జాడలేదు. రోజూ అతని రాక కోసం ఎదురు చూస్తూ గేటు దగ్గరే నిలబడేది లక్ష్మి. లక్ష్మి అతని భార్య.

చెల్లా చెదురుగా పడివున్న తెల్ల మబ్బుల కాగితాలని, పొందికగా అమర్చి, ఎర్రమబ్బుల రిబ్బన్ కట్టి బల్ల మీద సర్ది పడమటి కార్యాలయం నుంచి నిష్క్రమించాడు సూర్యుడు. పగటి తలుపులు ముయ్యగానే నిండుతున్న చీకటిని చూసి ఖంగారుపడ్డాడు అప్పలకొండ.

ఇంటి దగ్గర నాలుగేళ్ల పాప బిక్కు బిక్కు మని ఎదురుచూస్తూ వుంటుంది!

పాప గుర్తు రాగానే తాగుతున్న 'బీడీ' ముక్క దూరంగా విసిరిపారేసి, సైకిల్‌కి స్టేండు వేసాడు. గేటు తీసి మెట్లు ఎక్కాడు.

పరిధి దాటి ఎదిగిన క్రోటన్ మొక్కల కొమ్మలు అతని బుజానికి తగిలేయి. పరిధి దాటిన కొమ్మలను నరకటం, తోటని అందంగా వుంచటం అతని పనే; గానీ...

గానీ ఈ మధ్యన తోటపని అస్సలు చెయ్య లేకపోతున్నాడు.

ఇంజనీర్ గారు వెళ్ళవలసిన ' సైట్ ఇన్‌స్పెక్షన్' కి కూడా అతనే వెళ్ళవలసి వస్తోంది.

కాలింగ్ బెల్ నొక్కుదామని అనుకున్నాడు గాని ఆగిపోయాడు. లోపల ఎవరో ఘర్షణ పడుతున్నట్టున్నారు. ఇంజనీర్ గారి గొంతు గట్టిగ వినిపిస్తోంది.

అలిగిన భూదేవి తారా దీపాలు వెలిగించని ఆకాశాన్ని చూస్తూ వుంటే దీపం వెలిగించని తన ఇల్లు గుర్తు వచ్చింది అతనికి. పాప భయపడుతూ ఉంటుంది.

పెరటి వేపు నడిచేడు, లక్ష్మి అక్కడ వుంటుందేమోనని.

"ఎంటాల కూకుండిపోయావ్? పొద్దెక్కి పోనాది" మొహాన్ని రెండు చేతుల్లోనూ

అన్నుకొని  కూర్చున్న లక్ష్మిని చూసి కోఫంగా అడిగేడు అతను "ఇంటికి రావా, ఏమిటి?"

"రాకుండా  ఇక్కడే వుండి పోతానేంటి?"

"లెగు మరి, టైమయిపోనాది" తొందర పెట్టాడు అప్పలకొండ.

"అమ్మగారికి  చెప్పొద్దేమిటి?"

"వెళ్ళూ-వెళ్ళి  చెప్పిరా మరి"

"ఏమి చెప్పమంటావిప్పుడు  వాళ్ల తగూలాడుకుంటుంటేను"

ఏమి చెప్పాలో  తోచలేదు  అప్పలకొండకి.  ఇంజనీర్‌గారు, అతని భార్య తగవులాడుకోవటం ఏమిటి?  వాళ్ళకి  ఏమి తక్కువని,  బోలెడు డబ్బూ, మంచి ఆరోగ్యం.  పని చెయ్యటానికి పనివాళ్ళు.  కాలి మీద కాలు వేసుకుని కూర్చుంటున్నాడు. అయినా....

ఆకాశం ఒక్కసారి వురిమింది.  అది వురుములా అనిపించలేదు అప్పలకొండకి. తగవులాడే దంపతులు తపేలాలు  విసిరివేస్తున్నట్టు తోచింది.

"ఎందుకట తగవు"  ఓ నిమిషము ఆగి అడిగేడు.

"ఆ  ఏముందిలే"  అదోలా అంది లక్ష్మి.  "తిన్నది  అరక్క, అయ్యగారు ఆఫీసు నుంచి రాగానే అమ్మగారు లేచి టీ ఇవ్వలేదట.  ఇంకేముంది?  మాట మీద మాట పెరిగి పెద్ద తగవు  అయిపోతోంది".

"ఓస్ అంతేనా?"  చాలా తేలికగా అన్నాడు  అప్పలకొండ  "పద నేను తీరుస్తాను ఆ తగవు"

"నువ్వా?"  ఆశ్చర్యంగా అంది లక్ష్మి.

"అయ్యగారి  మోకాలంత లేవు నువ్వు తగవు తీరుస్తావా?"

నిజమే.  అప్పలకొండ చాలా పొట్టివాడు.

"అంత  తేలికగా తీసెయ్యకు"  అతనికి కోపం వచ్చింది.

"ఆఫీసులో కూడా అయ్యగారి పనుల్లో సగం నేను చేస్తూ వుంటాను."

అప్పలకొండ ముందు నడిచాడు, వెనుక లక్ష్మి.

" అయినా మీకేం తెలుస్తాయి లెండి మా కష్టాలు. ఇంటిపనులు ఫైలులో సంతకాలు పెట్టినంత సులువనుకుంటున్నారు కాబోలు"

"నేను ఆఫీసులో సంతకాలు మాత్రం పెడుతూ కూర్చుంటున్నాననని అనుకుంటూన్నావా?" ఇంజనీర్‌గారు అన్నారు. "సివిల్ ఇంజనీర్‌ని, ఎక్కడ పని వుంటే అక్కడకు వెళ్ళాలి, ఎండలో నిలబడాలి"

"అవునమ్మగారు" అప్పలకొండ అన్నాడు. "అయ్యగారు ఈ రోజు ఎంత అలసిపోయారో మీకేమి తెలుసండి?" అతడు పెదవి విరిచేడు. "ఆఫీసులో కూర్చుని సిగరెట్లు కాల్చి కాల్చి ఎంత అలసిపోయారో, పాపం! ఓ కాగితం కూడా సంతకం పెట్టని ఆయన అలసిపోక పోతే పనులు జరిగే చోట్ల తిరిగి తిరగివచ్చిన నేను అలసిపోయానా?"

ఆ దంపతులిద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"పొండి ఇక్కడి నుంచి" అరిచేరు అయ్యగారు.

" బలే చెప్పావులే మావా!" అప్పలకొండ వెనుక సైకిల్ ఎక్కుతూ అంది లక్ష్మి. "పొట్టివాడివైనా నువ్వు గట్టివాడివే"

"లేకపోతే మరీను" అప్పలకొండ అన్నాడు. "ఈ చదువుకున్న బాబులు వళ్ళు వంచి పనిచేయ్యడం ఏనాడో మానివేశారు. కనీసం సంతకాలు పెట్టడం కూడా కష్టమయిపోతోంది వీళ్ళకి. ఇలా అయితే మరి మన దేశం ఎలాగే బాగుపడేది?"

లక్ష్మి అతని వైపు ఆశ్చర్యంగా చూసింది. అప్పుడతను పొట్టివాడిగా కనిపించలేదు, అవసరమయితే, ఔద్యోగిక ప్రపంచాన్నే కొలవగల అభినవ వామనుడిలా కనిపించాడు, ఆమెకి.

**26-8-94 ఆంధ్రజ్యోతి సుచిత్ర వారపత్రిక**